వేరుశనగ.. లాభాలు మెండుగ

- మేలైన యాజమాన్యంతో మంచి దిగుబడి
- విత్తనశుద్ధి తప్పనిసరి
- సరైన సమయంలో తగిన ఎరువులు
- సిద్దిపేట అర్బన్ ఏఓ శ్రీనాథ్



మందపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: యాసంగిలో వేరుశనగ సాగుచేయడం రైతులకు ఎంతో లాభదాయకం. మేలైన యాజమాన్యపద్ధతుల ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. మండలంలోని మందపల్లిలో వేరుశనగ సాగుచేస్తున్న రైతు వీరన్నపేట జైపాల్ రెడ్డి పొలాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన పలు సలహాలు, సూచనలు చేశారు. విత్తనాలను నవంబరు చివరి వారంలోపు విత్తుకొంటే మంచి దిగుబడి సాధించడానికి అవకాశం ఉందని చెప్పారు.

దుక్కి తయారీ..

ఇసుకతో కూడిన గరప నేలలు లేదా నీరు త్వరగా ఇంకే ఎర్ర నేలలు వేరుశనగ సాగుకు చాలా అనుకూలమైనవి. ఎక్కువ బంకమన్ను కలిగిన నల్లరేగడి నేలలు పనికిరావు. విత్తే ముందు నేలను దున్ని చదును చేసుకోవాలి. యాసంగి సాగుకు ఎకరానికి 80కిలోల విత్తనాలు అవసరమవుతాయి.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

కిలో విత్తనానికి 1గ్రా టెబుకోనజోల్ 2డీఎస్ లేదా 3గ్రా మాంకోజెబ్ పొడిమందు పట్టించాలి. కాండం కుళ్లు తెగులు ఆశించే ప్రాంతాలలో ఒక మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ ను 7మి.లీ. నీటిలో కలిపి ఒక కిలో విత్తనానికి పట్టించాలి. వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో 6.5 మి.లీ. క్లోరిపైరిఫాస్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరి మాగాణుల్లో లేక కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు కిలో విత్తనానికి 200గ్రా. రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. వేరుకుళ్లు, మొదలు కుళ్లు, కాండం కుళ్లు వంటి తెగుళ్లు ఎక్కువగా ఆశించే పరిస్థితులలో కిలో విత్తనానికి 10గ్రా. ట్రైకోడెర్మా విరిడిని పట్టించి మంచి ఫలితాలు పొందవచ్చు.

విత్తే దూరం..

యాసంగిలో నీటిపారుదల కింద సాగుచేసేటప్పుడు 22.5×10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి.

కలుపు నివారణ, అంతరకృషి

కలుపు సమస్య తీవ్రంగా ఉన్న భూముల్లో వేరుశనగ విత్తిన 48గంటల లోపు ఒక ఎకరాకు 200లీటర్ల నీటికి 1లీ పెండిమిథాలిన్ కలిపి నేలపై పిచికారీ చేస్తే 25 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవచ్చు. విత్తిన 25రోజుల తర్వాత వెడల్పు ఆకులు గల కలుపు మొక్కలు ఉన్నట్లయితే ఎకరాకు ఇమాజితాఫిర్ 10శాతం లేదా ఇమాజీమాక్స్ 35శాతం కలుపు మందును 40గ్రా. ఎకరాకు 200లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై స్ప్రే చేసి అన్ని కలుపు మొక్కలను నివారించవచ్చు. సాధ్యమైనంతవరకు కలుపు మొక్కలను అంతర కృషి ద్వారా నివారించడమే మంచిది.

ఎరువులు వేసే సమయం, మోతాదు

భూసార పరీక్షను అనుసరించి ఎరువుల రకాలు మోతాదును నిర్ణయించుకోవడం మంచిది. సాధారణంగా ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 –5 టన్నుల బాగా కుళ్లిన పశువుల ఎరువు, 100కిలోల సూపర్ ఫాస్ఫేట్, 200కిలోల యూరియా, 35కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. పూతదశలో లేదా కలుపు తీసే ముందు ఎకరానికి 200కిలోల జిప్సం వేసుకుంటే నాణ్యమైన గింజలు వస్తాయి.



చిన్నకోడూరులో నిరుపయోగంగా ఉన్న గోదాం

నిర్మించారు.. వదిలేశారు

లక్షలు వెచ్చించి నిర్మించిన గోదాం వినియోగంలోకి రాకపోవడంతో నిరుపయోగంగా మారి మందు బాబులకు అడ్డాగా తయారైంది. చిన్నకోడూరు శివారులో పౌరసరఫరాల సంస్థ గోదాం నిర్మాణం పూర్తిచేసి 2015లో ప్రారంభించింది. కాని ఇప్పటి వరకు గోదాంలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించలేదు. ఆవరణ పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో నిండిపోయింది. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు స్థావరమైంది. సంబంధిత అధికారులు స్పందించి గోదాంను త్వరటా వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. – చిన్నకోడూరు(సిద్దిపేట):

హరీశ్‌రావుపై అర్థరహిత ఆరోపణలు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం



మాట్లాడుతున్న సాయిరాం

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజల ఆదరణ, అభిమానాలు ఉన్న ఎమ్మెల్యే హరీశ్‌రావుపై చక్రధర్ గౌడ్ అర్థరహిత ఆరోపణలు చేయడం సరికాదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేర చరిత్ర ఉన్న చక్రధర్ గౌడ్ గురించి ప్రజలకు తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదం, పదవుల కోసం హరీశ్‌రావుపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోపిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీకాంత్, సాయి ప్రేమ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించండి

సీపీఎం నేతల వినతి



ఏఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొముురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో జరుగుతున్న అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ డిమాండ్ చేశారు. ఇతర నాయకులతో కలసి ఆయన ఏఈఓ బుద్ది శ్రీనివాస్‌కు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత కాలంగా భక్తులు సమర్పించిన కానుకలు, కార్యాలయంలో ముఖ్యమైన రికార్డులు మాయమవుతున్నాయన్నారు. కాంట్రాక్టర్లు, అధికార పార్టీ నాయకులకు కమీషన్లు అందే విధంగా ఆలయ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, ఇస్తారి, బాలకిషన్ పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌లో నిర్వహించిన మూడో మహాసభలు జయప్రదంగా జరిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి చెప్పారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులుగా యాదగిరి, రవికుమార్, అరుణ్, రవీందర్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు.

క్రీడలతో పోటీ తత్వం పెంపొందుతుంది

డీఐఈఓ రవీందర్‌రెడ్డి



విజేత జట్టుతో రవీందర్‌రెడ్డి తదితరులు

సిద్దిపేటఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థుల్లో పోటీ తత్వం పెంపొందుతుందని తద్వారా భవిష్యత్‌లో వారు ఎంచుకున్న రంగాల్లో ఉన్నతంగా రాణిస్తారని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన వారోత్సవాల్లో భాగంగా జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాలీబాల్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. విజేతలను సమ్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, కోచ్ వెంకటేశ్, కనకచంద్రం, అశోక్ తదితరులు అభినందించారు.

ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

బీజేపీ జిల్లా నేతలు

గజ్వేల్‌రూరల్: ప్రజలను మోసం చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని బీజేపీ జిల్లా ప్రముఖ్ వెంకటరమణ, అసెంబ్లీ ప్రముఖ్ నందన్‌గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై మంగళవారం వారు చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేఏళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందని, ఆరు గ్యారంటీల పేరుతో గారడీ చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలపై బీజేపీ టోల్ ఫ్రీ నెంబర్ 92400 15247కి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మనోహర్‌యాదవ్, అశోక్‌గౌడ్, రాంరెడ్డి, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల నిర్వీర్యం

మిరుదొడ్డి(దుబ్బాక)/బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గురుకుల పాఠశాలలు నీర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్వీ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్, దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు పాపని సురేష్ గౌడ్ అన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అల్వాల చెప్యాల క్రాస్‌రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులకు సరైన భోజనాన్ని అందించడం లేదన్నారు. కుమార్, ఐలయ్య, రాజు, కొండల్, నాగరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల హరిబాబు బెజ్జంకి కేజీబీ, మోడల్ స్కూల్‌లను పరిశీలించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దుర్గ సుదర్శన్, సదిగౌడ్, హరీశ్‌వర్మ, భూపతిరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు ఉన్నతంగా బోధించండి: జడ్జి కృష్ణతేజ్



క్లాస్ రూంను పరిశీలిస్తున్న కృష్ణతేజ్

హుస్నాబాద్: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి కృష్ణతేజ్ స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. దివ్యాంగ చిన్నారులకు పళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు అందే బోధన గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించి పాటలు పాడించారు. వారికి చక్కగా చదువు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బండారి మనీల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కళాకారుల ఆట.. పాట



పాట పాడుతున్న కళాకారులు

దుబ్బాకరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మండలంలోని హబ్సిపూర్‌లో సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం ఆట..పాట నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారుల టీమ్ లీడర్ రవి, సెక్రెటరి వజ్రమ్మ, రవీందర్, క్రాంతికుమార్, ఎల్లయ్య, భార్గవి, తిరుమలయ్య, శ్యాంసుందర్, కనకయ్య, ప్రకాశ్, హరిప్రసాద్, భిక్షపతి, పోచయ్య, రమేశ్, అజీజ్‌అబ్దుల్, బాబు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి పవిత్రమైనది: నర్సారెడ్డి



కిరణ్‌సాగర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

గజ్వేల్: న్యాయవాద వృత్తి పవిత్రమైనదని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, లోక్‌సత్తా తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్ రావు అన్నారు. న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా గజ్వేల్ కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) కిరణ్‌సాగర్‌రావును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు న్యాయవాదుల సేవలను కొనియాడారు. కార్యక్రమానికి గజ్వేల్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగేందర్‌రావు అధ్యక్షత వహించగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పీసీసీ రాష్ట్ర నాయకులు సాజిద్ బేగ్, పట్టణ నాయకుడు దేశపతి రాజశేఖరశర్మ, న్యాయవాది రాంఫణిధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

హుస్నాబాద్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఎండబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ అధికారులు మాత్రం కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మాల ధారులకు సన్మానం

హుస్నాబాద్: మహా పాదయాత్ర పూర్తిచేసిన అయ్యప్ప మాల ధారులను అయ్యప్ప ఆలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక శ్రీమంతుల నరేందర్, గూడూరు శ్రీనివాస్, కృష్ణ అక్టోబర్ 16న కాలినడకన శబరిమలకు వెళ్లారు. డిసెంబరు 1న ఆయన శబరిమలకు చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. పాదయాత్ర పూర్తి చేసిన భక్తులు హుస్నాబాద్‌కు చేరుకోగా వారిని అయ్యప్ప ఆలయంలో గురుస్వాములు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్, గురుస్వాములు చంద్రయ్య, సురేందర్ రెడ్డి, మల్లయ్య, రవీందర్ గౌడ్, పూజారి భానుమూర్తి తదితరులు ఉన్నారు.

ఉద్యమంలో శ్రీకాంతచారి పాత్ర కీలకం



గజ్వేల్: నివాళులర్పిస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్సీ యాదరెడ్డి, బీఆర్ఎస్ నేత ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతచారి పాత్ర చాలా కీలకమని పలువురు నేతలు కొనియాడారు. శ్రీకాంతచారి వర్ధంతి సందర్భంగా మంగళవారం పలు మండలాల్లో నివాళులర్పించారు. గజ్వేల్లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి శ్రీకాంతచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సమాజం ఆయనను ఎన్నటికీ మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకియొద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు మధు, నవాజ్‌మీరా, కుమార్, కృష్ణారెడ్డి, జాఫర్‌ఖాన్ తదితరులు ల్గొన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని రంగథాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నేతలు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాంతచారి ఆత్మబలిదానంతో ఉద్యమ స్వరూపమే మారిందన్నారు. కార్యక్రమంలో రజనీకాంత్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, సాయిశ్వర్ గౌడ్, వెంకట్, సాయిప్రేమ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆకాశ్, హరీశ్, గణేశ్, చందు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులే కారణం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీకాంతచారి ఆత్మ బలిదానానికి కారణం బీఆర్ఎస్ నాయకులే అని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హరికృష్ణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శ్రీకాంతాచారి ఫ్లెక్సీ వద్ద కొవ్వత్తులు వెలిగించి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు యాదగిరి, లక్ష్మి, పాండు, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇదే స్ఫూర్తితో సాగుదాం..

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్



మొక్కలు నాటిన ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ.. ఆదర్శ మున్సిపాలిటీ స్ఫూర్తితో ముందుకు సాగుదామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించారు. యువత, మార్నింగ్ వాకర్స్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ సిబ్బందికి పరుగు పోటీలు, ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. వార్డుల్లో బ్లాక్ స్పాట్స్ వద్ద రంగవల్లులు వేసి రోడ్డు మీద చెత్త వేయొద్దని ప్రజలకు వినూత్నంగా అవగాహన కల్పించారు. కార్మికులకు దుస్తులు, ఇతర సామగ్రి అందజేశారు.

శతాధిక వృద్ధుడి మృతి



పుల్లునాయక్(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, శతాధిక వృద్ధుడు గుగులోతు పుల్లు నాయక్ (105) అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. మండలంలోని పెద్దతండాకు చెందిన పుల్లునాయక్ 1919లో జన్మించారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మనుమలు, మనుమరాళ్లు, ముని మనుమలు కలిసి సుమారు 51మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. పుల్లునాయక్ స్వాతంత్య్ర సమయంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పలువురు బీజేపీ నాయకులు ఆయన మృత దేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): కేజీబీవీ మిరుదొడ్డి జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టుకు తాత్కాలిక నియామకంపై మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి స్వర్ణలత తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన మహిళలు ఏడో తేదీలోగా కేజీబీవీలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

నిందితుల అరెస్టు

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామంలోని కనుకదుర్గమ్మ ఆలయంలో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నీరేశ్ మంగళవారం తెలిపారు. రిమాండ్‌కు తరలించిన వారిలోపెద్దపల్లి జిల్లా, హనుమంతులపేటకు చెందిన త్రిదండి అనిల్, పైడి అజయ్ ఉన్నట్లు తలిపారు.

మట్టి డంపు సీజ్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన మట్టి డంపును రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్‌చేశారు. ఆ మట్టి సుమారు 200టిప్పర్లు ఉంటుందని, దీనిని 5న వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని చెప్పారు.

రూ.25కోట్ల రుణాలే లక్ష్యం

హుస్నాబాద్‌రూరల్: ఈ ఏడాది 425 స్వశక్తి సంఘాలకు రూ.25కోట్ల రుణాలు ఇప్పించాలని లక్ష్యం పెట్టుకున్నట్లు ఏపీఎం భిక్షపతి చెప్పారు. ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ నవంబరులో రూ.19.53కోట్ల రుణాలను మహిళలకు అందించామన్నారు. ఈ నెల 10 నాటికి మరో రూ.5కోట్ల రుణాలను అందజేస్తామని, ఒక్కొక్క సంఘానికి రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణ పరిమితిని పెంచామని చెప్పారు.

విద్యార్థి దశను వృథా చేయొద్దు

సీఐ లతీఫ్

దుబ్బాక/కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, సమయాన్ని వృథా చేసుకోవద్దని తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చట్టాలు, వివిధ రకాల నేరాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. ఇబ్బందులు ఎదురైతే 100కు కాల్‌చేసి సహాయం పొందాలన్నారు. అలాగే షీటీం వాట్సాప్ నంబర్ 87126 67435, మహిళా పోలీస్ స్టేషన్ నంబర్ 87126 67435కు సమాచారం అందించాలని సూచించారు. ఎస్‌ఐ రవికాంత్‌రావు, హెచ్‌ఎం నహీమా కౌసర్, షీటీం ఏఎస్‌ఐ శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కోహెడరూరల్ మండంలోని తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్.. బేడ్ టచ్, ఈవ్ టీజింగ్‌పై ఏఎస్‌ఐ పవన్‌కుమార్, షీటీమ్ సభ్యులు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రైతులకు చెయిచ్చిన సీఎం

బెజ్జంకి(సిద్దిపేట): రైతుభరోసా వేయకుండా సీఎం రేవంత్ రెడ్డి రైతులకు చెయ్యిచ్చారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆరోపించారు. బెజ్జంకిలోని మాజీ ఎంపీపీ నిర్మల ఇంటి వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. లక్ష్మణ్, తిరుపతి, లక్ష్మారెడ్డి, దుర్గ సుదర్శన్, కిష్టయ్య, మహేందర్, మోహన్, శ్రీనివాస్, రవి తదిరులు పాల్గొన్నారు.

◆ శానిటేషన్ కార్మికులకు వైద్య పరీక్షలు

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శానిటేషన్ వర్కర్స్‌కు ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. అధికారులు వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ స్వరూపరాణి. కమిషనర్ నాగేందర్, ప్రభాకర్, కృష్ణ పాల్గొన్నారు.

◆ గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గర్భిణులకు మంగళవారం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలని, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలనే ఉద్దేశ్యంతో ఈ కిట్లు అందజేశామన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజలింగంగౌడ్, దేవిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, సాయిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

◆ సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): సీయం కప్ పోటీలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రాధిక కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 7 నుంచి 8వరకు గ్రామ, 9నుంచి 11వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 5వ తేదీలోపు వివరాలు అందజేయాలని చెప్పారు.

◆ బీటెక్ విద్యార్థుల వితరణ

వర్గల్(గజ్వేల్): మండలంలోని చాంద్‌ఖాన్‌మక్త ప్రభుత్వ పాఠశాలకు బీటెక్ విద్యార్థులు రూ.26వేలు విలువచేసే రెండు బీరువాలు, పుస్తకాలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన బీటెక్ విద్యార్థులు రాము, సంగీత, స్వభాను, సుజన్‌కుమార్ మంగళవారం హెచ్‌ఎం ప్రశాంత్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం కనకరాజు, మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

◆ అరుదైన శస్త్ర చికిత్స

సిద్దిపేటజోన్: స్థానిక సిరి పిల్లల ఆసుపత్రిలో ఓశిశువుకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు సాయిరాం, రమేశ్‌నాయక్ మంగళవారం తెలిపారు. కేవలం 1.4కిలోల బరువు ఉండి, నెలలు నిండక ముందే పుట్టిన చిన్నారికి సంక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు చెప్పారు.

◆ బిల్లుల చెల్లించకపోవడం సరికాదు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆశాలకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే కొత్త సర్వేలు చేపట్టాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు లింగంపేట ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని మంగళవారం పీహెచ్‌సీ కేంద్రం వద్ద ఆశాలతో కలిసి ఆందోళన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ తేజశ్వినికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తలకు లెప్రసీ సర్వే చేయాలని ఆదేశించిన ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఆశాలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించకుండా సర్వే చేయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు.

◆ అడవుల సంరక్షణపై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపూరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, అగ్నిప్రమాదాల నియంత్రణపై ఫారెస్టు బీట్ అధికారి వై.రాముడు మంగళవారం అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యత, అడవుల్లో జరిగే అగ్నిప్రమాదాలు, వాటి నియంత్రణ చర్యలను వివరించారు. హెచ్‌ఎం అయిలయ్య, ఉపాధాయ్యులు పాల్గొన్నారు.

◆ సమగ్ర శిక్షణ ఉద్యోగుల నిరసన

దుబ్బాక/దుబ్బాకటౌన్: సమగ్ర శిక్షణ ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల మండల అధ్యక్షుడు దేవరాజు ఎంఈఓ ప్రభుదాస్‌కు వినతి పత్రం అందజేశారు. మండల వనరుల కేంద్రం ఎదుట మంగళవారం సమగ్ర శిక్షణ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 12 యేళ్లుగా పనిచేస్తున్న తమను సీఎం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఎంటీఎస్‌ను అమలు చేయాలని, తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలన్నారు. దేవరాజు, గణేశ్, శ్రీధర్, నర్సింహాచారి, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990